# రెండు రూపాల మనుషులు

రచన:
శ్రీ రేణుకా శ్రీ

మనిషిలో మర్మము, నీటిలోని లోతు-అంత సులభంగా-కనుక్కో- లేమంటారు. ఈ ప్రపంచంలో 'రెండు రూపాల మనుషులు' చాలమంది వున్నారు.

పగలు 12 గంటలు-

ఎండ ఎర్రగా కాలిపోతూ వుంది. ఎక్కడ చూచినా నీళ్ళున్నాయన్న భ్రమ కలుగుతూ వుంది. అంతటి వాతావరణంలో కూడ ఇరువురు మిత్రులు రైల్వే స్టేషన్-

'క్యాంటీన్' వద్ద నిలుచుని వున్నారు. మాటిమాటికి 'హ్యాండ్ కర్ చీఫ్'తో చెమటను తుడుచుకుంటున్నారు. 'వాచ్' కేసి చూసుకుంటున్నారు. ట్రయిన్ యింకా రాలేదెందుకా? అని.

ఇద్దరూ సోడాలు త్రాగారు. ఇంతలో రావలసిన ట్రయిన్ రానేవచ్చింది. అందులోంచి దిగవలసిన అమ్మాయి దిగనే దిగింది.

'ప్రసాద్! ఆ అమ్మాయేరా, నేను చెప్పినమ్మాయి. ఆ బ్లూ శారీ?' అన్నాడు-ప్లాట్ ఫారమ్ మీదికి దిగిన-ఆ అమ్మాయిని ఆనవాలుతో సహా చూపిస్తూ నాథ్-ఐమీన్ జగన్నాథ్.

'నాయనా! జగన్నాథా! ఇంతకు మునుపు ఆ అమ్మాయితో నీకు పరిచయమే లేదంటివే, ట్రయిన్ నుండి దిగగానే 'ఆమే'నని ఎలా కనుక్కున్నావు?' రేణుకా ప్రసాద్ సందేహాన్ని వెలిబుచ్చాడు.

'అబ్బి! సూర్యుడు నిప్పులు క్రక్కుతుంటే, మధ్యలో నీ ధర్మసందేహా లేమిట్రా? అదిగో మా యింటిప్రక్కనున్న వాళ్ళక్కయ్య 'రిసీవ్' చేసుకుంటూ, సందేహం తీరిందా?' అన్నాడు నాథ్.

బ్యూటిఫుల్, వెరీ బ్యూటిఫుల్, ఈ ఎండొకటి ఏడ్చింది కాని... సంధ్యా కాంతులలో నయితేఆ... ఆ అమ్మాయి .. యింకెంత మెరిసి పోవు .' ఆ అమ్మాయిని అలాగే చూస్తూ-అన్నాడు రేణుకా.ప్రసాద్.

'ప్రసాద్! నీ కవిత్వాన్ని కట్టిపెట్టి, ఆ అమ్మాయి యెంత బావుందో చూడు?'

'అదే చూస్తున్నాను, జగన్నాథా! ఈనాటి రచయితలు తమ కథలలో రాసే అందమైన హీరోయిన్లకంటే ఎన్నోరెట్లు 'బెటర్', నేచ్యురల్ బ్యూటీ' అన్నాడు-సౌందర్యోపాసకుడైన-రేణుకా ప్రసాద్.

'ఆ అమ్మాయి బయలుదేరింది ఇకనే వెళ్లొస్తాను.' సౌందర్య పిపాసకుడైన నాథ్ బయలుదేరాడు.

'నన్నిక్కడ ఒంటరిగా వదిలా?' వెల్లముఖం వేశాడు రేణుకా ప్రసాద్.

'సాయంకాలం మన మామూలు స్థలంలో కలుసుకుంటాగా?' అంటూ జవాబుకైనా ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు నాథ్. రేణుకా ప్రసాద్ అలాగే నిలబడిపొయ్యాడు-ఏం చెయ్యాలో తోచక. సస్పెన్స్-

* * * *

అసలు విషయం-

రేణుకా ప్రసాద్,జగన్నాథ్ స్నేహితులు. ఇరువురూ స్కూల్ ఫైనల్ పాసయ్యారు. ఆ తరువాత - పరిస్థితుల ప్రాబల్యంవలన-ఉద్యోగాన్వేషణలో మునిగి పొయ్యారే కాని, యింకా తేలలేదు. ప్రస్తుతం యిద్దరూ నిరుద్యోగులు, పెండ్లికావలసిన యువకులు.

జగన్నాథ్ యింటిప్రక్కనే - యీమధ్య ఎవరో-రైల్వే తాలూకు మనిషి క్రొత్తగా అద్దెకొచ్చి చేరాడు. ఆ యింట్లో గోపాలస్వామి, ఆయన భార్య-చింతామణి-యిరువురే వున్నట్లున్నారు. పిల్లలు యింకా లేనట్లుంది. వారు వచ్చి దాదాపు 2 నెలలు గడిచాయి. ఇంతలో చింతామణి చెల్లెలు-అక్కడికి-వస్తున్నట్లు తెలిసింది.

ఆ విషయం తన చెల్లెలు అరుణద్వారా - తెలిసికొనిన మగధీరుడు, నాథ్ ప్రసాద్‌తో చెప్పాడు.

ఆమె వచ్చే రోజు కొరకు ఎదురు చూశారు.

ఈ రోజు వెళ్ళారు. స్టేషన్‌లో చూశారు.

పనిలేని మనసు పరిపరి విధాల పరుగిడుతుంటుందంటారు.

ఇదే నేమో?

* * *

ఆ రోజు సాయంకాలం-

'ఆ అమ్మాయి పేరు 'నీరజ' అట-కాస్తే చిలిపి రకంగానే కనిపిస్తుంది. అసలు విషయం ఏమిటంటే-ఆ అమ్మాయికి పెండ్లి అయ్యి దాదాపు ఆరు నెలలు కావస్తుందిట. ఆమె భర్త వి. ఎల్. డబ్ల్యు. ట్రయినింగ్ కెళ్ళాడుట.

అందుకని-అక్కగారింటికి వచ్చిందట. ఇదీ నేను సేకరించిన విషయం' అన్నాడు నాథ్ వుషారుగా యీల వేస్తూ. అన్ని విషయములు ఆమూలాగ్రంగా తన చెల్లెలు-ద్వారా తెలిసికొనిన డిటెక్టివ్.

'పెండ్లయినదా? పాపం! నాథ్!! వెరీ డేంజర్. ఆనందాన్ని అసంపూర్తిగా అనుభవించిన జీవం. జీవిత మాధుర్యాన్ని కొద్దిగా రుచి చూచిన ప్రాణం, జాగ్రత్త. అయినా వివాహమయిన స్త్రీలతో సంబంధాలు పెట్టుకోవటం చాల తప్పు. 'అనిర్వర్ణనీయమ్ పరకళత్రమ్' అని అన్నాడు కాళిదాసు. నాదీ అదే పాలసీ' అన్నాడు సీరియస్‌గా ఫీలింగు మార్చి రేణుకా ప్రసాద్.

'నోరు ముయ్యరా! బుద్ధి లేకపోతే సరి' అంతకన్నా సీరియస్‌గానే అన్నాడు నాథ్.

'అదేఁవిటి. నోరు తెరిచాడు ప్రసాద్.

'లేకపోతే ఏఁవిట్రా నీ మాటలు, నువ్వూను. ఇప్పుడు ఎవరు, ఎవరితో సంబంధం పెట్టుకో జూస్తున్నారంటున్నావ్?' నాథ్ కళ్లు కనిష్టువు లయ్యాయి.

'నాథ్! ఆవేశపడకు. ఇటీజ్ ఫ్రండ్లీ థింగ్. అయినా నాకు సూటిగా మాట్లాడే అలవాటుంది. ఏదో ఒక వుద్దేశ్యం లేకపోతే...ఆమెను గురించి యింత రాద్ధాంతం ఎందుకు? ఇంత సేకరణ ఎందును??'

రేణుకా ప్రసాద్ మాటలతో నాథ్ నేలచూపులు చూశాడు. 'ఏడ్చావ్ లేవోయ్! బడుద్దాయ్!! ఏదో క్రొత్త అని సంబర పడ్డాం. అట్లని ఆశ పెట్టుకుంటామా? పిచ్చివూహ.' నాథ్ మొలక మీసంమీద చిరునవ్వు మొలచింది.

* * * *

పదిరోజులు గడిచాయి-

జగన్నాథ్‌కు నీరజకు బాగా పరిచయం యేర్పడ్డది. అరుణతో కలసి నీరజ నాథ్ యింటికి వచ్చేది. నాథ్ నాన్న వుదయం లేస్తేపాలం పనికి వెళ్లేవాడు. అమ్మ వంటింట్లో వుండేది. అరుణ స్కూలుకు వెళ్ళేది. మంచి సమయం, నీరజ, నాథ్‌లు కలసి, కూర్చొని గంటలు తరబడి మాట్లాడేవారు. నవ్వుకునేవారు. అందులో ఎక్కువగా యీనాటి సినిమాల చరిత్ర వచ్చేది.

జగన్నాథ్ కూడ - అప్పుడప్పుడు-నీరజ యింటికి (ప్రక్కల్లేగా?) వెళ్లేవాడు. గోపాలస్వామి సరిగ్గా యింటిపట్టునవుండే ఘటంకాదు. ఇకపోతే-ఫస్టు యియర్ స్కూల్ ఫైనల్ పాసయినందుకు నాథ్‌ను యెంతగానో మెచ్చుకునేది చింతామణి. పైగా నాథ్ ఎంచక్కటి ప్రవర్తనతో ఆమె మనస్సులో మంచి అభిప్రాయాన్ని చూరగొన్నాడు.

నాథ్ డిటెక్టివ్ పుస్తకాలను నీరజకు సప్లై చేసేవాడు. తను కథలు రాసేందుకు కూడ ప్రయత్నిస్తున్నట్లు చెప్పేవాడు. ఎవరైనా నీరజను గురించి ప్రస్తావిస్తే-తనకు నీరజపై 'అక్క'లాటి అభిప్రాయం తప్ప వేరే వుద్దేశ్యాలేమీ లేవన్నట్లు నొక్కి చెప్పేవాడు, నాథ్ ఏది ఏమయినా యీ పదిరోజులలో నీరజకు నాథ్ మీద సదభిప్రాయమే యేర్పడినదని చెప్పాలి.

* * * ♦

పక్షం రోజులు గడిచాయ్-

నాథ్-యిప్పుడు-రేణుకా ప్రసాద్‌ను అంతగా కలుసుకోవటంలేదు. కనిపించినప్పుడల్లా-ఏదో పనివున్నవాడిలా హడావుడి పడుతూ-'యిప్పుడేవస్తా'నంటూ, చిరునవ్వులు చిలికించి, తప్పుకొని వచ్చేవాడు. రేణుకా ప్రసాద్ సన్నగా నవ్వును నేవాడు. ఆ నవ్వులో-ఎక్కడో వూల తీగెల సవ్వడులు వినిపించేవి.

ఆరోజు పూర్ణిమ-

గోపాలస్వామీ అండ్ ఫ్యామిలీ ఫస్టుషో సినిమాకు బయలుదేరారు.

అరుణద్వారా ఆవిషయాన్ని తెలిపికున్న నాథ్-అరుణతో సహా-తనూ సినిమాకు బయలుదేరాడు. అందరూ కలుసుకున్నారు-

సినిమా హాలులో నాథ్ ప్రక్కగా నీరజ కూర్చోవటం తటస్థించింది. అదేం పెద్ద తప్పుగా కనిపించలేదు మిగత వారికి, నీరజకూడ 'ఫ్రీ'గా కూర్చుని సినిమా చూడసాగింది.

* * * *

మరుసటిరోజు సాయంకాలం రేణుకా ప్రసాద్‌ను కలుసుకున్నాడు నాథ్,

'జగన్నాథా! ఎలా వుంది మీ అక్క?' అన్నాడు ప్రసాద్ నవ్వుతూ.

'వెళ్ళిపోయింది' భిన్నవదనుడైన నాథ్ నిజంగా బాధపడుతూ అన్నాడు.

'ఏం? ఎందుకని??' ఆత్రుతగా అడిగాడు ప్రసాద్.

'ప్రసాద్?' అంటూ ఏడ్చాడు నాథ్. అన్ని విషయములు పూసగ్రుచ్చినట్లు చెప్పాడు.

'నాథ్! నేను ముందే చెప్పాను. విన్నావుకావు. ఏమైనా నీవు తప్పు చేశావు. తొందర పడ్డావు. రెండు రూపాల మనిషి వయ్యావు. చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు. నాథ్? మరోమారు యిలాంటి బలహీనతకు దిగజారకు.' అని ఓదార్చాడు-మిత్రుడు-రేణుకా ప్రసాద్.